క్లుప్తంగా

పాఠశాలలో మౌలిక సౌకర్యాలకు రూ.లక్ష వితరణ



హెచ్ఎం జీవీ రమణకు చెక్కును అందిస్తున్న సీతారామరాజు

అల్లవరం: కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పనకు సీనియర్ పాత్రికేయులు నడింపల్లి సీతారామరాజు రూ.లక్ష చెక్కును పాఠశాల హెచ్ఎం జీవీ రమణకు ఆదివారం అందించారు. కొమరగిరిపట్నంలో జరిగిన శ్రీరామ నవమి వేడకల్లో సీతారామరాజు మాట్లాడుతూ పాఠశాలలోని గ్రంథాయలాన్ని దత్తత తీసుకుని వాటి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రంథాలయాన్ని రూ.2 లక్షలతో అత్యాధునిక గ్రంథాలయంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంపీ చైర్మన్ సుంకర వాసు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

'మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు' పోస్టర్ ఆవిష్కరణ

తాళ్లరేవు: 'మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు' పెరుగుతున్న విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఎం నాయకులు ఇంటింటికీ స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా సంఘాల భవనం వద్ద పార్టీ జిల్లా కమిటీ నాయకుడు ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదానీ కంపెనీతో ఒప్పందం చేసుకుని స్మార్ట్ మీటర్లను పెడుతుందన్నారు. దీని వల్ల భవిష్యత్‌లో విద్యుత్ వినియోగదారులకు చాలా నష్టం కలుగుతుందన్నారు. వివిధ చార్జీల పేరుతో కరంటు బిల్లులు పెంచుతున్నారని, ప్రజలందరూ ఐకమత్యంగా ఉండి ఈ విధానాలను వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, చల్లా సంతోష్‌కుమార్, పాలెపు ఈశ్వరరావు, దడాల అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు బీరువాల సమర్పణ



ఆలయాలకు బీరువాలను బహూకరిస్తున్న దాతలు

తాళ్లరేవు: మండల పరిధిలోని రెండు ఆలయాలకు ఒక దాత రెండు బీరువాలను బహూకరించారు. మట్లపాలెం గ్రామానికి చెందిన పినపోతు స్వామి తన తండ్రి పినపోతు విశ్వనాథం జ్ఞాపకార్థం స్థానిక రామాలయం, ధనమ్మ తల్లి ఆలయాలకు బీరువాలను సమర్పించారు. వీటిని శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం అందజేశారు.

గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం



గోదావరి వారధిపై స్పృహలో లేని జనార్దనరావు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం పల్లవారి పాలెం వివేకానంద వారధిపై నుంచి ఒక వ్యక్తి గోదావరిలోదూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అల్లవరం మండలం గుడ్డివాని చింత ప్రాంతానికి చెందిన జమ్మి జనార్దనరావు జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉదయం వివేకానంద వారధిపై నుంచి గోదావరిలో దూకాడు. అదే సమయంలో వారధి కింద చేపలు పట్టుకుంటున్న జాలర్లు ఆ విషయం గమనించి జనార్దనరావును కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలా సాగర్ ఆ ప్రాంతానికి చేరుకుని జనార్దనరావును ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ఓట్లేసిన 16,228 మందిని విస్మరించడం తగదు

యానాం: నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందిన సీఎం రంగసామికి 2021లో ఎన్నికల్లో 16,228 మంది ఓటర్లు ఓటు వేశారని అయినప్పటికి ఆయన కనీస కృతజ్ఞత చూపకుండా యానాం డంపింగ్ యార్డు స్థలసేకరణ, చెత్త సమస్యను పట్టించుకోకపోవడం దారుణమని ఆదివారం స్థానిక బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు పెసల వీరవెంకటేష్ ప్రకటనలో తెలిపారు. యానాం నియోజవర్గ ప్రజలు వేలాదిగా రంగసామికి ఓట్లు వేస్తే ఆయన కేవలం యానాం ప్రజా ఉత్సవాలు, ఫ్లవర్ షోలకు చుట్టం చూపుగా వచ్చి వెళ్లిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో రంగసామికి 16,228 ఓట్లు వస్తే ఆయనపై గెలుపొందిన గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌కు 16,874 ఓట్లు వచ్చాయని ఆ విధంగా ఇద్దరి మధ్య వ్యత్యాసం 656 ఓట్లు మాత్రమేనని అన్నారు. వేలాదిగా యానాం ప్రజలు మద్దతు తెలిపారని, అయితే ఎక్కడిచెత్త అక్కడ పేరుకుపోయి గుట్టలుగా ఉండి దుర్గంధంలో జీవిస్తున్న యానాం ప్రజలను పట్టించుకోవాలని ఆయన కోరారు.



చినకొత్తలంక రామాలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



దేవగుప్తంలోని సీతారాముల కల్యాణం చేస్తున్న పండితులు



ఉప్పలగుప్తంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



అమలాపురం మహిపాల వీధిలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న భక్తులు

రమణీయం.. రామయ్య కల్యాణం

- వాడవాడలా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



జార్జీపేటలో వైభవంగా జరుగుతున్న సీతారాముల కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



యానాం కొత్తపేట కోదండ రామాలయంలో మల్లాడి పూజలు



మురమళ్లలో సీతారాముల కల్యాణం

ముమ్మిడివరం: శ్రీరామనవమి వేడుకలను ఆదివారం ముమ్మిడివరం మండలంలో ఘనంగా నిర్వహించారు. రామాలయల వద్ద చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన పలువురు దంపతులు స్వామివారి కల్యాణ మహోత్సవం పాల్గొన్నారు. ఆలయాల వద్ద బెల్లం పానకం, వడపప్పు ప్రసాదం పంపిణీ చేశారు. పలు ఆలయాల వద్ద భారీ అన్నసమారాదన నిర్వహించారు. మండలంలో టీటీఆర్ నగర్, గంటా వీధి, క్రాపచింతలపూడి, గాడిలంక, చినకొత్తలంక, కర్రివానిరేవు, సీహెచ్ గున్నేపల్లి, అయినాపురం, సోమిదేవర పాలెం, కొత్తలంక,తోపాటు పలు గ్రామాలలో రామాలయాల వద్ద భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం నిర్వహించారు.

జార్జీపేటలో పుష్పాభిషేకం

తాళ్లరేవు: సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. అశేష భక్తజనం నడుమ సీతారాముల వారిని గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించి స్వామివారి కల్యాణాలను వైభవంగా జరిపించారు. అనంతరం అన్నసమారాధనలు చేశారు. ప్రధానంగా జార్జీపేటలో సీతారామచంద్రమూర్తిస్వామి వారి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు సుదర్శనం సత్య వెంకట ఫణికుమార్ స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో పుష్పాభిషేకం కార్యక్రమాన్ని కన్నుల పండువగా చేశారు. ఈ సందర్భంగా భక్తులకు పానకం పంపిణీ చేసి, విసనకర్రలు అందజేశారు. జార్జీపేట పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అబ్బిరెడ్డి భాస్కరం, కనకాల సత్యనారాయణ, సలాది వెంకట్రాజు, అబ్బిరెడ్డి మదన సుందరం, కూనపురెడ్డి బుజ్జి, కనకాల ఆనంద కోదండరావు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తాళ్లరేవు కేశవపురం గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అదేవిధంగా కోరంగి ప్రధాన రహదారిలో ఎంపీపీ స్కూల్ వద్ద వేంచేసియున్న శ్రీ సీతారాముల ఆలయంలో 50 వసంతాల (గోల్డెన్ జూబ్లీ) కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పోలేకుర్రు, పి.మల్లవరం, ఇంజరం, చొల్లంగి, జి.వేమవరం, కోరంగి, గాడిమొగ తదితర గ్రామాలలో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించడంతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

ఐ.పోలవరం: శ్రీరామ నవమి పర్వదినాన్ని ఆదివారం మండలంలోని అన్ని రామాలయాల్లో వైభవంగా నిర్వహిచారు. ఆలయాల్లో సీతారాముల కల్యాణ కనుల పండువగా జరిగింది. మండలంలో మురమళ్ల, ఐ.పోలవరం, కేశనకుర్రు, జి.వేమవరం, టి.కొత్తపల్లి, పశువుల్లంక, కొమరగిరి, తదితర ప్రాంతాలలో గల రామాలయాల్లో సీతారామ కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. చలివిడి, వడపప్పు, బెల్లం పానకాలు భక్తులకు పంపిణీ చేశారు. నూతన దంపతులు ఈ కల్యాణ మహోత్సవాల్లో పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. తొలుత సీతారాములను పల్లకీలో సమీపంలో ఉన్న గోదావరికి, కాలువలకి తీసుకొని వెళ్లి పుణ్యస్నానాలు చేయించారు. ఈసందర్భంగా రామాలయాల వద్ద భారీ చలువ పందిళ్లు, భారీ అన్నసమారాధనలు, భజన కాలక్షేపాలు, విద్యుత్ దీపాలు, పచ్చిపూలతో అలంకరణ చేశారు. అంతేకాక కొంత మంది ఇళ్లలో కూడా సీతారాముల కల్యాణాలు జరిపించుకొన్నారు. తీరప్రాంతగ్రామం అయిన భైరవపాలెం తీర్థాలమొండి గ్రామంలో మత్యకారులు సీతారాముల విగ్రహాలను కోలాటాలు, భజన కీర్తనలతో గ్రామోత్సవం నిర్వహించారు

అమలాపురం రూరల్‌లో..

అమలాపురం రూరల్: మండలం పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. బండారులంక అంబేడ్కర్ నగర్ రామాలయంలో కార్తిక ప్రియంక దంపతులు కర్తలుగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. బళ్ల సత్తిబాబు పండితుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. బండారులంక శర్మ లేవుట్‌లో సీతారాముల కల్యాణాన్ని జడ్డి కొండా బులికృష్ణ దంపతులు కర్తలుగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు. భట్నవిల్లి శెట్టిపేట, సమనసలో రామాలయాల్లో నవమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు.

అల్లవరంలో..

అల్లవరం: మండలంలో శ్రీరామచంద్రమూర్తి, సీతాదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.దేవగుప్తంలో కొదండ రామాలయంలో బొక్కా రాజేష్, పావని దంపతుల చేతల మీదుగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. కొమరగిరిపట్నం గ్రామంలో పంచారామ క్షేత్రంలో నడింపల్లి సీతారామరాజు దంపతులు, గుర్రం శ్రీను దంపతుల చేతుల మీదుగా కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎస్ రాజు, నానిరాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ డి.సత్తిబాబురాజు, దాట్ల గోపిరాజు, నల్లా రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తంలో...

ఉప్పలగుప్తం: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో సీతారామ కల్యాణం మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉప్పలగుప్తం గ్రామంలో ఉన్న రామాలంయంలో అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. భీమనపల్లిలో కొళ్లపల్లి ఈశ్వర భగవాన్ దంపతులచే కలస్థాపన చేసి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అమలాపురం పట్టణంలో..

అమలాపురంటౌన్: పట్టణం సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం వద్ద కౌండిన్య నగర్‌లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తూరగ సాయి ప్రసన్నకుమార్, అనురాధ దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, కుడుపూడి వెంకట శ్రీనివాస్, గుత్తుల సుబ్రహ్మణ్యం, గుత్తుల శ్రీనివాసరావు, కుడుపూడి త్రినాథరావు, మట్టపర్తి నాగేంద్ర, దొమ్మేటి రాంబాబు, అప్పారి సూరిబాబు పాల్గొన్నారు. నల్లావీధి రామలయం వద్ద జరిగిన సతారామ కళ్యాణంలో ఆర్డీవో కే మాధవి కుటుంబ సభ్యులు కలిసి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. కౌన్సిలర్ అశెట్టి భారతి, మాజీ కౌన్సిలర్ ఆదిబాబు పాల్గొన్నారు. పెరమ్మ అగ్రహారంలో గంటి శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యానాంలో..

యానాం: నియోజకవర్గ పరిధిలో పలు గ్రామాల్లో రామాలయాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక కొత్తపేటలో కొలువైన శ్రీకోదండరామాలయంలో పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నవమి వేడుకల్లో పాల్గొని రాములవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా తోటవారి వీధి, అంబేడ్కర్‌నగర్, గణపతినగర్, మెట్టకూరు, పిల్లారాయవీధి, దోబీస్ట్రీట్, పరంపేట, సావిత్రినగర్ ,గిరియాం పేట, సావిత్రినగర్, నీలపల్లి, గోపాల్‌నగర్ తదితర గ్రామాల్లో రామాలయాలను దర్శించుకుని నవమి వేడుకల్లో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన రహదారిపై వివాదం



ఇంజరంలో ప్రమాదకరంగా ఉన్న వివాదాస్పద రహదారి



ఇంజరంలో రహదారి లేకుండా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనం

తాళ్లరేవు: ఇంజరం పంచాయతీలో స్థానిక షిర్డీ సాయిబాబా వారి ఆలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనానికి సంబంధించిన రహదారిపై వివాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఒక దాత అంగన్‌వాడీ భవనానికి స్థలాన్ని బహూకరించారు. అయితే ఈ భవనానికి వెళ్లేందుకు సరైన రహదారి లేదు. అధికారులు భవన నిర్మాణాన్ని ప్రారంభించి, నిధుల కొరత కారణంగా అసంపూర్తిగా నిలిపివేశారు. ఇలా ఉండగా ఇటీవల ఈ భవనానికి సంబంధించి ఉన్న ఒక చిన్నపాటి సందును పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. తమ స్థలంలో పంచాయతీ సిబ్బంది పనులు చేయడం, కనీసం సమాచారం ఇవ్వకపోవడంపై పెద్దింటి వెంకట నగేష్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రహదారి సౌకర్యం లేని స్థలంలో ప్రభుత్వ భవనం ఎలా నిర్మిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. తమ ఇంటి ప్రహరీ ఎన్నో ఏళ్ల క్రితం కట్టిందని, ఆ సందులో పిల్లలు వెళ్లినపుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనానికి సరైన రహదారి సౌకర్యం కల్పించాలని నగేష్ కోరారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు నగేష్ విలేకర్లకు తెలిపారు.

చెరువుల్లో నీటిని నింపుకోవాలి

అమలాపురం రూరల్: చెరువుల్లో నీటిని పూర్తిస్థాయిలో నింపుకోవాలని అధికారులు కోరారు. సూపరింటెండెంట్ ఇంజినీరు, ఇరిగేషన్ సర్కిల్, ధవళేశ్వరం లేఖను అనుసరించి ఇరిగేషన్ కాలువలన్నింటికీ ఈ నెల 15వ తేదీన నీటి సరఫరాను నిలిపివేసేందుకు నిర్ణయించారు. ఈ లోపు అమలాపురంలో గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని మంచినీటి చెరువులు, పశువుల చెరువులు, రజక చెరువులనూ సంబంధిత ఇరిగేషన్ కాలువల ద్వారా నీటిని నింపుకోవాలని ఇరిగేషన్ శివరామకృష్ణ తెలిపారు.

పేపర్ ప్లేట్ మెషీన్ వితరణ



మెషీన్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రబాబు, ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురం రూరల్: మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భట్నవిల్లి గ్రామంలోని లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ పండుల రవీంద్రబాబు సొంత నిధులు రూ.లక్షతో సమకూర్చిన పేపర్ ప్లేట్ మెషీన్‌ను ఆదివారం అందజేశారు. ఫౌండేషన్ చైర్ పర్సన్ పుణ్యమంతుల రజిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావుతో కలిసి ఎమ్మెల్సీ రవీంద్రబాబు ఈ మెషీన్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్సీ రవీంద్రబాబు మాట్లాడుతూ మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్‌కు ఇచ్చిన మాట ప్రకారం ఈ పేపర్ ప్లేట్ మెషీన్ ఇచ్చామని, దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుకోటి సుజాత, గ్రామ కమిటీ అధ్యక్షుడు మండలిక సుబ్రహ్మణ్యం శర్మ, మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముమ్మిడివరం: స్థానిక శిర్డీ సాయిబాబా ఆలయంలో లేండి బాగ్‌లో శ్రీదత్త సాయి అన్న ప్రసాద నిలయంలో సోమవారం నూతనంగా నిర్మించిన గురు దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు గుద్దటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ముమ్మిడివరానికి చెందిన ప్రముఖ వైద్యులు స్వర్గీయ డాక్టర్ నేమాని వీర వెంకట సత్యనారాయణమూర్తి, సూర్యకాంతం దంపతుల సౌజన్యంతో ఆయన కుమారుడు డాక్టర్ నేమాని జగన్మోహన్, సబిత దంపతులతో ఈ ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించారు. సోమవారం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది. అలాగే ఆలయ 25వ వార్షికోత్సవం సంరద్భంగా సోమ, మంగళ, బుధ వారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించండి

యానాం: పట్టణంలో నెలరోజుల నుంచి చెత్తను తొలగించకపోవడంతో చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయిందని, దాని వల్ల దుర్గంధం వెదజల్లుతోందని, ఈసమస్యను పరిష్కరించక పోవడంపై ఆలిండియా అన్నాద్రవిడ మున్నేట్ర కజగం(ఏఐఏడీఎంకే) రాష్ట్ర కార్యదర్శి ఎ అన్బళగన్ ఆదివారం ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అయన మాట్లాడుతూ గత నెలన్నర రోజులుగా డంపింగ్‌యార్డు స్థలసేకరణ, వేస్ట్‌మేనేజ్‌మెంట్ సమస్యలపై ప్రస్తుత ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు మధ్య వాగ్వాదం జరుగుతుందని ఆరోపించారు. యానాం రీజియన్ పుదుచ్చేరి కలెక్టరేట్ పాలనా యంత్రాంగం పరిధిలో ఉంటుందని అయినప్పటికీ సంబంధిత అధికారులు ఈ చెత్తసమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పొళ్లమ్మ జాతర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పొళ్లమ్మ అమ్మవారి జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. వాల్‌పోస్టర్లు, కరపత్రాలు అమ్మవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వాటిని ఆవిష్కరించారు. అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజులు జరుగుతాయని ఉత్సవ కమిటీ చైర్మన్ సాధనాల సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ టీచర్ల నిరసన దీక్షల విరమణ



కాంట్రాక్టు టీచర్లతో చర్చిస్తున్న సీఎం రంగసామి, స్పీకర్ సెల్వం

యానాం: నియోజకవర్గంలో యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్ల పరిధిలో వివిధ ప్రభుత్వ స్కూళ్లలో సేవలు అందిస్తున్న తమను పర్మినెంట్ చేయాలని నిరసన దీక్షలు చేస్తున్న కాంట్రాక్టు టీచర్లు సీఎం రంగసామి హామీతో తమ నిరసన దీక్షలను విరమించుకుంటున్నట్టు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020లో పాఠశాల విద్యాశాఖ 288 మంది కాంట్రాక్టు టీచర్లను మెరిట్ ప్రాతిపదికన నియమించారన్నారు. ఆ విధంగా నెలకు తమకు వివిధ కేటగిరీలుగా రూ.20వేలు, రూ.30వేలు, రూ.40 వేలను వేతనాలను చెల్లిస్తున్నారన్నారు. ఇప్పటికే తమ ఉద్యోగ వయోపరిమితి సైతం దాటిపోయిందని తెలిపారు. ఒక వైపు తాము ఆందోళన చేస్తుంటే, కొద్దిరోజుల కిందట కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా పర్మినెంట్ టీచర్లను ఎంపిక చేసి నియామక ఉత్తర్వులను అందించారన్నారు. దీనివల్ల తమకు అన్యాయం జరుగుతుందన్నారు. తమ దీక్షలకే ఏఐఏడీఎంకే నేత అన్బళగన్, డీఎంకే నేత శివ, కెనెడీ, ఆర్.సెంథిల్‌కుమార్, ఎల్.సంపత్ తదితరులు మద్దతునిచ్చారు. అనంతరం సీఎం రంగసామి అసెంబ్లీ కాంప్లెక్స్ ఆఫీసులో ఆందోళనకారులతో చర్చలు జరిపారు.అధికారులతో చర్చించి కాంట్రాక్టు టీచర్ల సేవలను పొడిగించేలా సంబంధిత ఫైల్‌ను ఎల్జీకి పంపుతానని హామీ ఇవ్వడంతో తమ ఆందోళనను విరమిస్తున్నట్టు కాంట్రాక్టు టీచర్లు తెలిపారు.

ప్రభుత్వ బడిబాట, బంగారుబాట



పల్లిపాలెంలో పిల్లలను చేర్పించే అడ్మిషన్ పత్రాలు ఇస్తున్న ఎంఈవో-2, సర్పంచ్ శ్రీనివాస్

సఖినేటిపల్లి: మన పాఠశాల, మనందరి బాధ్యత కాన్సెప్ట్‌లో భాగంగా ఆదివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిబాట, బంగారుబాట అనే కార్యక్రమాన్ని పల్లిపాలెం మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ మేరకు ఎంఈవో-2 మద్దాలి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఫీజులెందుకు దండగ, ప్రభుత్వ బడి ఉండగ, పాఠశాలలో పిల్లలను చేర్పించండి, భవితకు బంగారు బాట వేసుకోండి అంటూ ఇంటింటా ప్రచారం ఉపాధ్యాయులు చేపట్టారు. ఈ మేరకు పిల్లలను చేర్పిస్తూ ముందుకు వచ్చిన తల్లితండ్రులకు తగిన అడ్మిషన్ పత్రాలను ఎంఈవో-2, సర్పంచ్ ఒడుగు శ్రీనివాస్ అందించారు. ఎస్ఎంసీ చైర్మన్ కొపనాతి వెంకట్రాజు, హెచ్ఎం పి.సత్తిపండు, టీచర్ మౌనిక మణి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, విద్యాశాఖ సిబ్బంది బి.శ్రీనివాస్, బి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.